క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి



ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును కలిసిన ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ

పాడేరు: వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ పాడేరు నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన శరభ సూర్యనారాయణ శుక్రవారం ఉదయం పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్ట చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును శరభ సూర్యనారాయణ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మాజీ సర్పంచ్ మినుములు కన్నా పాత్రుడు, తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



దొరమామిడిలో పరిసరాలు పరిశుభ్రం చేయిస్తున్న ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు

గంగవరం: గంగవరం, పిడతమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గిరిజన గ్రామాల్లో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశ అంగన్‌వాడీ వర్కర్లు సంయుక్తంగా గ్రామాల్లో ఇంటింటా పర్యటించి ఇంటి ఆవరణలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. దోమలు వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై స్థానికులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దొరమామిడిలో అంగన్‌వాడీ కార్యకర్త చిలకమ్మ, ఆశ వర్కర్లు పార్వతి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



గంగవరంలో వాహనాలను తనిఖీలు చేస్తున్న సీఐ నరసింహమూర్తి

గంగవరం: అనుమతులు లేని నిషేధిత వస్తువులను రవాణా చేయవద్దని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి డ్రైవర్లకు సూచించారు. మండల కేంద్రమైన గంగవరంలో ఆయన శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా వాహన రికార్డులను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. రహదారి భద్రత నిబంధనలను పాటించాలన్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనచోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

వేలాడే విద్యుత్ వైర్లకు కర్రలతో ఊతం



తుంగమడుగులలో కర్రల సపోర్ట్‌తో ఉన్న కరెంట్ వైర్లు

అడ్డతీగల: వేలాడే విద్యుత్ వైర్లకు కర్రలతో ఊతం ఇచ్చారు తుంగమడుగుల గ్రామస్తులు. ఈ వేలాడే విద్యుత్ తీగల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తుంగమడుగులలోని అబ్బులు ఇంటి సమీపంలో చాలా రోజులుగా విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉండడంతో కరెంట్ షాక్‌కు గురవుతారోనని భయపడి కర్రలను ఊతంగా ఉంచారు. వెంటనే స్తంభాలు వేసి ఆ వైర్లను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- శిథిలదశకు చేరిన పాఠశాల భవనం
- అద్దె ఇంట్లో తరగతులు
- సమస్యలతో విద్యార్థులు సతమతం
- పట్టించుకోని అధికారులు
- దొరమామిడి ఎంపీపీ స్కూల్ దుస్థితి



శిథిలావస్థలో ఉన్న దొరమామిడి ఎంపీపీ పాఠశాల భవనం



తలుపులు లేని తరగతి గది



అద్దె ఇంట్లో తరగతుల నిర్వహణ

గంగవరం : మండలంలోని పలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల భవనాలు దుస్థితి అధ్వానంగా ఉన్నాయి. మండల కేంద్రానికి అతి సమీపంలోని గల దొరమామిడి ఎంపీపీ పాఠశాల భవనం పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఈ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉంది. సుమారు అయిదు దశాబ్దాల నాటి ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులూడుతున్న పైకప్పు, బీటలు వారిన గోడలు, వర్షం పడితే గదులన్నీ జలమయమవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. గతేడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు ఈ భవనం శ్లాబ్, గోడలు పెచ్చులూడిపడ్డాయి. దీంతో స్థానికుల సహాయంతో అద్దె ఇంట్లోకి పాఠశాలను మార్చారు. ప్రస్తుతం ఇక్కడే తరగతుల నిర్వహణ సాగుతోంది. ఈ అద్దె ఇంట్లోని ఇరుకైన గదుల్లో తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొర సదుపాయాల నడుమ పాఠశాల కొనసాగుతుందని చెబుతున్నారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు సుమారు 40 మంది అభ్యసిస్తున్నారని హెచ్‌ఎం మురళీకృష్ణ తెలిపారు. దొరమామిడి పాఠశాల భవనం దుస్థితిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాలని, లేక వేరే భవనాన్ని కేటాయించాలని వారు కోరుతున్నారు.

దీనిపై ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ దొరమామిడి ఎంపీపీ పాఠశాల భవనాలు దుస్థితిని , మౌలిక సౌకర్యాలు కోసం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. దొరమామిడి ఎంపీపీ పాఠశాలకు కావలసిన భవనాలు గురించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు

జగనన్న పాలనలో పాఠశాలల అభివృద్ధి



గత వైఎస్సార్‌సీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాడు–నేడు ద్వారా మండలంలో 38 పాఠశాలల అభివృద్ధి జరిగింది. అన్ని పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాం. దొరమామిడి ఎంపీపీ పాఠశాలకు భవనా కోసం గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారులు స్పందించి దొరమామిడి ఎంపీపీ పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– పల్లాల కృష్ణారెడ్డి, ఎంపీపీ, గంగవరం

ప్రతిపాదనలు పంపాం



పాఠశాల అభివృద్ధికి తగిన కృషి చేస్తున్నాం. తక్షణమే భవనాలు సమకూర్చాలని ఇందుకు తగిన నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. కొత్త పాఠశాల భవనం కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేలా చూస్తాం.

– ఆదినారాయణ, ఎంపీటీసీ, ఆముదాలబంద

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న కళాజాత కళాకారులు

హుకుంపేట: మండలంలోని డి.చింతలవీధిలో నాబార్డ్ సహకారంతో ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై కళాజాత ద్వారా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ విశాఖపట్నం ఆదేశాల మేరకు పాడేరు, హుకుంపేట తదితర ప్రాంతాల్లో కళాజాత ద్వారా బ్యాంకు అందిస్తున్న వివిధ పథకాలు, రుణాలపై అవగాహన కల్పిస్తున్నట్టు స్థానిక ఎస్‌బీఐ బీఎం గౌతమ్ తెలిపారు. కళాజాత కళాకారులు, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ



అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న హెచ్‌ఎం పల్లవి

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి హెచ్‌ఎం పల్లవి, ఉపాధ్యాయులు తదితరులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పల్లవి మాట్లాడుతూ ఆయా నిర్మాణాలకు రూ.46లక్షల నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం



డాక్టరేట్ పొందిన సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు : విద్య పట్ల ఉన్న మక్కువతో కష్టాలను అధిగమించి ఉన్నత విద్యావంతుడిగా ఎదిగి డాక్టరేట్ పొందిన గిరిజన యువకుడు తెడబారికి సురేష్ కుమార్ నేటి తరం గిరిజన యువతకు ఆదర్శమని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో గిరిజనాభివృద్ధిలో ఐటీడీఏల పాత్ర అంశంపై సురేష్‌కుమార్ డాక్టరేట్ పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పాడేరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తాను చేసిన పరిశోధన పత్రాన్ని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు సురేష్‌కుమార్ అందజేశారు. డాక్టరేట్ గ్రహీత సురేష్‌కుమార్‌ను ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, వాణిజ్య విభాగ జిల్లా ఉపాధ్యక్షుడు డీపీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



వరలక్ష్మిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: చదువుకొని విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలోనే ఉద్యోగం పొంది పదవీ విరమణ చేసిన అరుదైన సంఘటన రాజవొమ్మంగిలో జరిగింది. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కాకూరి వరలక్ష్మి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆమె ఇదే పాఠశాలలో పదవ తరగతి వరకు చదివారు. విద్యాశాఖలో ఉద్యోగం సాధించిన ఆమె ఏజెన్సీ వ్యాప్తంగా అనేక పాఠశాలల్లో పనిచేశారు. చివరికి ఆమె చదువుకున్న పాఠశాలకే బదిలీపై వచ్చారు. పదవీ కాలం ముగియడంతో విరమణ పొందారు. ఆమె ఉద్యోగ విరమణ కార్యక్రమం పాఠశాలలో శుక్రవారం సందడిగా జరిగింది. ఆమెతో పాటు స్థానిక పాఠశాలలో చదువుకొని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు, ఉపాధ్యాయులు, బంధువులు స్నేహితులు వచ్చి ఆమెను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గోపాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ వరలక్ష్మి చేసిన సేవలను కొనియాడారు. చైర్మన్ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అవగాహన



మర్రివాడలో పశువుకు చికిత్స చేస్తున్న రాజేష్ కుమార్



గొజ్జిలమడుగులోని మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న సిబ్బంది

కొయ్యూరు: వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కొయ్యూరు వెటర్నరీ వైద్యులు కె.రాజేష్ కుమార్, ప్రసన్న కుమార్‌లు సూచించారు. మర్రివాడ, రత్నంపేటలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా 60 అనారోగ్య పశువులకు చికిత్స చేశారు. 110–పశువులు, 34–పెయ్యలు, 122–గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేశారు. మండలంలో నిర్దేశించిన పంచాయతీల్లో పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. పశు వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించామన్నారు. పశువులకు ఎలాంటి అనారోగ్యం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరామన్నారు. సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

రాజవొమ్మంగి: మండంలోని గడుఓకుర్తి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశువైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పశుసంవర్ధకశాఖ సిబ్బంది పశువులకు వచ్చే రోగాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం తెల్లజాతి, నల్లజాతి పశువులకు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. సిబ్బంది లక్ష్మణరావు, వెంకటేష్, సుబ్బరాజు, చిన్నయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న పాత్రుడి వ్యాఖ్యలు సరికాదు



కొయ్యూరులో మాట్లాడుతున్న నేతలు



పెదబయలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘాల నేతలు

పెదబయలు/కొయ్యూరు/మారేడుమిల్లి: గిరిజన చట్టాలపై స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని, మన్యంలోని 1/70 చట్టం జోలికొస్తే సహించేది లేదని గిరిజన సంఘం, సీపీఎం నాయకులు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ గిరిజన సంఘాలు, సీపీఎం నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో పెదబయలు జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, సీపీఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మన పడాల్, సీపీఐ మండల కార్యదర్శి దేముడు, గిరిజన సమాఖ్య నాయకులు సతీష్, దారమల్లేశ్, మాజీ సర్పంచ్ రాంబాబు, ఆదివాసీ చైతన్య సంఘం మండల నాయకుడు బాబూరావు మాట్లాడుతూ ఇటీవల విశాఖలోని జరిగిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో భూ బదలాయింపు చట్టం సవరణ చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారన్నారు. దీన్ని ప్రతి గిరిజనుడు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

రంపచోడవరం: మండలంలోని కాకవాడ, గండి, రాకోట, చెలకవీధి, సువార్లవాడ ప్రాంతాల్లో దుస్తుల పంపిణీ, అన్నదానం కార్యక్రమాన్ని రాజమండ్రికి చెందిన హోలీ ట్రినిటీ లూథరన్ చర్చి బిషప్ డాక్టర్ చంద్రపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి కమిటీ ప్రతినిధి దేవభూషణ్ మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు చర్చి తరపున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. హెచ్‌టీసీ చైర్మన్ జాన్సన్, దేవదాసు సంఘ సభ్యులు, నానాజీ, శ్రీధర్, మనోహర్, రత్నరాజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు



గాయపడిన చింటు

చింతపల్లి: మండల కేంద్రంలో సైకిల్ నుంచి పడడంతో తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానిక సాయినగర్‌కు చెందిన బల్లుల చింటు సైకిల్‌పై వస్తూ ప్రమాదానికి గురికావడంతో స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో క్షతగాత్రుడి కంటి గుడ్డుకు ఇనుప రాడ్డు బలంగా గుచ్చుకోవడంతో పాటు తలకు తీవ్ర గాయమైంది. ఇక్కడ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తరలించారు.

మార్చి 10 నుంచి క్రికెట్ పోటీలు

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ గ్రామంలో మార్చి 10 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న గంగమ్మతల్లి మహోత్సవాలను పురస్కరించుకొని మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు సురేష్, రాజేష్, శంకర్, వెంకట్, గౌరి, సీతులు తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గంగమ్మతల్లి పండుగ సందర్భంగా కిలగాడలో మండల స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని, టోర్నీలో పాల్గొనేందుకు ప్రవేశ రుసుము రూ. 500 చెల్లించి, 8వ తేదిలోగా టీమ్ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల క్రీడాకారులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు 8688608762, 7569312668, 8688992704 నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

వన్య ప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి సౌజన్యదేవి

ముంచంగిపుట్టు: వన్య ప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యతని కిలగాడ పశు వైద్యాధికారి మత్స్యరాస సౌజన్యదేవి అన్నారు. మండలంలోని కిలగాడ కేజీబీవీలో విద్యార్థులకు జంతు సంక్షేమం , చట్టాలు, సంక్షేమ మార్గదర్శకాలపై శుక్రవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సౌజన్యదేవి మాట్లాడుతూ జంతువుల చట్టాలపై అవగాహన లేక బలి చేయడం జరుగుతుందని, జంతువులను ఉద్దేశ పూర్వకంగాని, నిర్లక్ష్యంగాని బంధించినా, ఇబ్బందులు కలిగించినా కఠిన శిక్షలు తప్పవన్నారు. జంతువుల పట్ల కరుణ చూపాలని, జంతు సంపదను పరిరక్షించాలన్నారు. విద్యార్థి దశ నుంచి జంతు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సాయి ప్రసన్న, ఏహెచ్‌ఏలు రఘునాథ్, రఘురామ్, ఉపాధ్యాయులు, అధిక సంఖ్యల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

అమరులైన విద్యార్థులకు నివాళి



అమరులైన విద్యార్థులకు నివాళులర్పిస్తున్న జీఎస్‌యూ నాయకులు

ముంచంగిపుట్టు: విశాఖపట్నం బుల్లయ్య కళాశాలలో 1999లో ఆదివాసీ హక్కుల బహిరంగ సభకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ముంచంగిపుట్టు మండలం కిలగాడ మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థులకు శుక్రవారం గిరిజన విద్యార్థి సంఘం నాయకులు నివాళులర్పించారు. ప్రమాదం జరిగిన కిలగాడ మలుపు వద్ద అమరులైన స్థలంలో జీఎస్‌యూ జెండాను ఆవిష్కరించి, పలు నినాదాలు చేశారు. అమరులైన జోలాపుట్టు జెడ్పీ పాఠశాల 10వ తరగతి విద్యార్థులైన కిల్లో సురేంద్రకుమార్, కటారి కొండబాబు, మజ్జి జయరాము తదితరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిరసాని కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసీ ఉద్యమాలకు గిరిజన విద్యార్థి సంఘం ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. అమరులైన గిరిజన విద్యార్థుల ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. నాయకులు మాధవరావు, బాబూజీ, సురేష్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలు



గూడెంకొత్తవీధిలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



రాజవొమ్మంగిలో కటౌట్‌కు ముసుగువేసిన దృశ్యం

గూడెంకొత్తవీధి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో వివిధ రాజకీయ నాయకులు, పార్టీల ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించే పనులు చేపట్టారు.

రాజవొమ్మంగి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, కటౌట్ల తొలగింపు పనులు జరుగుతున్నాయి. అధికారుల ఆదేశాల మేరకు రాజవొమ్మంగిలోని ఫ్లెక్సీలు, కటౌట్ల తొలగింపు, ముసుగు వేసే పనుల్లో రాజకీయ నాయకులు, కార్యకర్తలు నిమగ్నమయ్యారు.

సేవలతోనే ప్రత్యేక గుర్తింపు



కృష్ణపడాల్‌ను సత్కరిస్తున్న మాజీ మంత్రి బాలరాజు, తదితరులు

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వారు చేసిన సేవలే తగిన గుర్తింపు, గౌరవాన్ని ఇస్తారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పసుపులేటి బాలరాజు అన్నారు. గూడెంకాలనీలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసిన కంకిపాటి కృష్ణపడాల్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు సహచర ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బాలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయుని సేవలను కొనియాడారు. హెచ్‌ఎంలు రామరాజుపడాల్, రాజంనాయుడు, చిన్నయ్యపడాల్, గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటరమణ, కామేశ్వరరావు, గణేశ్వరరావు, వీరన్నపడాల్ తదితరులు ఉపాధ్యాయుడు కృష్ణపడాల్ దంపతులను ఘనంగా సత్కరించారు.